

'సామ్రాజ్య' వేడుకలకు సన్నాహం

భద్రాద్రి రామాలయంలో ఈనెల 31న జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలకు నేడు అంకురార్పణ జరగనుంది. 10లో

శోభకృత్ ఆగమనం..



తెలుగు సంవత్సరాది.. శోభకృత్ నామ ఉగాది పండుగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. షడ్రుచుల పచ్చడిని దేవుళ్లకు నైవేద్యం పెట్టి, ఇంటిల్లిపాదీ ప్రసాదంగా స్వీకరిస్తారు. బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమానికి పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంటనష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

గుండాల: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు అన్నారు. మంగళవారం ఆయన ఆళ్లపల్లి మండలంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అంచనా మాత్రమే వేశామని, తమ సిబ్బంది గ్రామాల్లో నేరుగా పరిశీలించాక పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తారని తెలిపారు. ఆయన వెంట టెక్నికల్ ఏడీఏ రవికుమార్, ఏఓ దీపక్ ఆనంద్, మండల వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్, ఏఈఓ అరుణ ఉన్నారు.

అమృత్‌తో మహర్దశ

'గూడెం' రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రణాళిక

- రాబోయే 50 ఏళ్లకు తగ్గట్టుగా సౌకర్యాల కల్పన
- అమృత్ భారత్ పథకంలో భద్రాచలం రోడ్ స్టేషన్‌కు చోటు
- ఆరు నెలల్లో పనులు ప్రారంభం



భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : రైల్వే శాఖ చేపట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా కొత్తగూడెంలోని భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రైల్వే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తే మరో ఆరు నెలల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో మూడు స్టేషన్లు..

మారుతున్న కాలానికి తగ్గట్టుగా ప్రయాణికుల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా స్టేషన్లను పూర్తిగా ఆధునికీకరించేందుకు అమృత్ భారత్ పేరుతో రైల్వే శాఖ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా తొలి విడతలో దేశవ్యాప్తంగా 1000 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలంరోడ్ (కొత్తగూడెం), ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో చేపట్టాల్సిన అభివృద్ధికి సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులను సిద్ధం చేస్తున్నారు. మరోవైపు స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, చేపట్టాల్సిన పనుల వివరాలను పరిశీలించేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఆయా స్టేషన్లలో స్వయంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే మధిర, ఖమ్మం స్టేషన్ల సందర్శన పూర్తయింది. త్వరలో భద్రాచలంరోడ్ స్టేషన్‌కు రైల్వే ఉన్నతాధికారుల బృందం రానుంది.

రాబోయే 50 ఏళ్లకు సరిపడేలా..

రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అమృత్‌భారత్ పథకంతో ఇది మల్టీ మోడల్ స్టేషన్‌గా మారనుంది. ఈ మేరకు ఇంజనీరింగ్ విభాగం అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఏమైనా మార్పులు, చేర్పులు అవసరమైతే చేపడతారు. అనంతరం నిధుల మంజూరుకు రైల్వే బోర్డుకు తుది ప్రతిపాదనలు అందుతాయి. ఈ ప్రక్రియ అంతా పూర్తయి పనులు ప్రారంభం అయ్యేందుకు మరో ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది.

భద్రాచలం రోడ్ కీలకం..

రైల్వే పరంగా జిల్లా వెనుకబడి ఉంది. బొగ్గు రవాణా ద్వారా రైల్వే బోర్డుకు ఆదాయం మెండుగా వస్తున్నా కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్ల విషయంలో ఆశించిన ప్రగతి లేదు. జిల్లా మొత్తానికి రైల్వే పరంగా భద్రాచలం రోడ్ రైల్వే స్టేషనే పెద్ద దిక్కుగా ఉంది. ఇల్లెందు రైల్వే స్టేషన్‌ను (సింగరేణి కాలరీస్) ఇప్పటికే ఎత్తేశారు. మణుగూరు స్టేషన్ ఉన్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అయితే ఇటీవల భద్రాచలంరోడ్ – సత్తుపల్లి మార్గం అందుబాటులోకి వచ్చింది. ఇది కాకుండా జిల్లా మీదుగా మణుగూరు – రామగుండం, భద్రాచలం – మల్కన్‌గిరి మార్గాల నిర్మాణం త్వరలో జరగనుంది. వీటన్నింటికీ కేంద్ర బిందువు భద్రాచలం రోడ్ కానుంది. దీంతో ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయక తప్పని పరిస్థితి రైల్వేశాఖకు ఏర్పడింది. అందువల్లే ఏ రెండు ప్రధాన నగరాలను కలిపే రైల్వే రూట్‌లో లేకుండా, ఓ మూలన ఉన్నప్పటికీ రైల్వే శాఖ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ చోటు సాధించగలిగింది.

డీపీఆర్‌లో పొందుపరిచిన పనులు

- రెండంతస్తుల్లో నూతన స్టేషన్ భవనాలు
- ఏసీ, జనరల్ వెయిటింగ్ హాళ్లు
- బాలింతలకు ప్రత్యేక గదులు
- ఎస్కలేటర్
- ప్రయాణికులు బస చేసేందుకు వీలుగా డార్మెటరీ
- భోజనశాల, క్యాంటీన్
- టీసీలకు అధునాతన విశ్రాంతి గదులు
- వచ్చి, వెళ్లే మార్గాల అభివృద్ధి
- ప్రత్యేక ఆటో స్టాండ్
- స్థానిక సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక ఆర్చి

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

- క్రీడామైదానాలు త్వరగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



దుమ్ముగూడెం : కంటి పరీక్ష చేయించుకున్న మహిళకు కళ్లద్దాలు పెడుతున్న కలెక్టర్ అనుదీప్

చర్ల/ దుమ్ముగూడెం: అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించారు. చర్ల మండలం లక్ష్మీకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న గ్రంథాలయ స్థలాన్ని, చర్ల ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న ఎంసీహెచ్ (వైద్యశాల) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణ పనుల నాణ్యతపై రాజీ పడొద్దని అన్నారు. ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆ తర్వాత పెద్దపల్లి సమీపంలో కొనసాగుతున్న సీతమ్మసాగర్ వరద కరకట్ట పనులను తనిఖీ చేశారు. దుమ్ముగూడెం మండలం ములకపాడులో క్రీడామైదాన పనులు ఇంతవరకూ ప్రారంభించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 నెలల క్రితం స్థలం కేటాయిస్తే ఇప్పటిదాకా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాశీనగరంలో కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పర్ణశాల పీహెచ్‌సీలో ఇటీవల ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ శిరీష, తహసీల్దార్లు చంద్రశేఖర్, భరణి బాబు, ఎంపీపీ రేసు లక్ష్మి, ఆరోగ్య మహిళ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సైదులు, డాక్టర్ మణికంఠా రెడ్డి, ఎంపీడీఓలు చంద్రమౌళి, రామకృష్ణ, ఎంపీఓ ముత్యాలరావు, డాక్టర్ రేణుకారెడ్డి, గొంది వెంకటేశ్వరరావు, ఎస్టీ సంక్షేమ ఈఈ నానాజీ, డీఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ పర్యటన సమాచారాన్ని తనకు తెలియజేయలేదంటూ దుమ్ముగూడెం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు

జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్

పాల్వంచ: జిల్లాలోని 154 ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. మంగళవారం పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలకు 240 పుస్తకాలు, 7 పోస్టర్లను అందించనున్నామన్నారు. పాఠశాలల్లో వాటిని ఎలా అమర్చాలి? ఏవిధంగా ఉపయోగించాలి? అనే వివరాలను తెలిపారు. ప్రతి పాఠశాలకు రూం టు రీడ్ అనే సంస్థ ప్రచురించిన పుస్తకాలు, నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తకాలు, పిల్లలు కూర్చోవడానికి ఒక కార్పెట్, పుస్తకాలు ఉంచడానికి ర్యాక్‌లు అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు సీహెచ్ స్వరూప్‌కుమార్, ఎస్.రాజశేఖర్, ఎస్‌కే సైదులు, సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీఏ సేవలు వినియోగించుకోవాలి

అశ్వారావుపేట: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల వాహన వినియోగదారులు ఆర్టీఏ సేవలను వినియోగించుకోవాలని ఎంవీఐ జయపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల ప్రారంభించిన ఈ కార్యాలయంలో ప్రతి శుక్ర, మంగళవారాల్లో వాహనాల రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. మంగళవారం 16 వాహనాలు రిజిస్ట్రేషన్‌కు, ఎల్‌ఆర్‌ఎల్‌లు 19 వచ్చాయని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు మాత్రం ప్రస్తుతానికి ఇక్కడ అందుబాటులో లేవని, దీని కోసం కొత్తగూడెం రావాల్సిందేనని తెలిపారు. స్థానికంగా స్థలం కేటాయింపు తర్వాత డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను ప్రారంభిస్తామని ఎంవీఐ జయపాల్‌రెడ్డి అన్నారు.



క్లుప్తంగా

మళ్లీ కొట్టుకుపోయిన 'పెద్దవాగు' కల్వర్టు మట్టి


పెదవాగు వద్ద కల్వర్టు, మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు అవస్థలు పడుదుతున్న ప్రజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి – వడ్డెరరంగాపురం గ్రామాల మధ్యలోని పెదవాగు కల్వర్టు వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మళ్లీ గ్రావెల్ కొట్టుకుపోయింది. కొన్నేళ్లుగా ఈ కల్వర్టు వద్ద మట్టి పోయడం, కొద్ది నెలలకే వర్షాలు, వరదలతో కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. కల్వర్టు వద్ద మట్టి కొట్టుకుపోవడంతో వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. పెదవాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో చిన్నపాటి వర్షం, వరద వస్తే చాలు ఈ ప్రాంత వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. త్వరతగతిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీల లెక్క తేల్చడం లేదు..

- దేశ సంపదను బీజేపీ కార్పొరేట్లకు దోచి పెడుతోంది
- వచ్చే ఎన్నికల్లో భద్రాచలంలో పోటీ చేస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- జిల్లాలో ముగిసిన జనచైతన్య యాత్ర


పాల్వంచ బహిరంగసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

పాల్వంచ/బూర్గంపాడు/సుజాతనగర్/భద్రాచలంటౌన్/జూలూరుపాడు/సింగరేణి (కొత్తగూడెం) : దేశంలో ఉన్న బీసీల లెక్క తేల్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం నాన్చుడి ధోరణి అవలంబిస్తోందని, ఎన్నికల హామీలను విస్మరించి సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర మంగళవారం భద్రాచలం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరుపాడుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో తమ్మినేని మాట్లాడుతూ.. దేశ జనాభాలో 53 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్ ఫలాలు దక్కడం లేదన్నారు. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి రాగానే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి, ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని హామీ ఇచ్చారని, 9 ఏళ్లు దాటినా కనీసం 15 పైసలు కూడా ఎవరి ఖాతాల్లోనూ జమ కాలేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అటకెక్కిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో కి వచ్చాక నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నుల్లో పరిపాలన చేస్తున్న బీజేపీ తన అసలు ఎజెండా అయిన హిందూత్వ స్థాపన కోసం మత ఘర్షణలు సృష్టిస్తోందన్నారు. కార్పొరేట్లకు వరాలిస్తూ, పేదలను పట్టించుకోని మోదీని గద్దె దించేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్‌తో తాము పొత్తు పెట్టుకున్నా.. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఓటమికి కమ్యూనిస్టులే కారణమన్నారు. ఇటీవలి అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంచలం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ స్కామ్‌లో అసలు నిందితులను విడిచిపెట్టి గుమస్తాను బాధ్యుడిని చేయడం సరికాదని, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎం పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. కాగా, తమ్మినేని యాత్రకు పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు సైతం యాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు మిడియం బాబూరావు, కాసాని ఐలయ్య, ఏజే రమేష్, మచ్చా వెంకటేశ్వర్లు, భూక్యా వీరభద్రం, యాసా నరేష్, పాలడుగు భాస్కర్, జ్యోతి, నర్సారెడ్డి, పుల్లయ్య, బ్రహ్మాచారి, రాంబాబు, అన్నవరపు సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, ఉడుగుల శ్రీకాంత్, గడ్డం స్వామి, మర్లపాటి రేణుక, వెంకటరెడ్డి, సంతోష్, లీలావతి తదితరులు పాల్గొన్నారు. పాల్వంచ, బూర్గంపాడు మండలం సారపాకలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు.





విద్యుత్ ఉద్యోగులు సత్తా చాటాలి..


ప్రసంగిస్తున్న వ తిమ్మినేని వారధ్రం

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల 2022 పీఆర్సీ జాప్యంపై యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, 24న హైదరాబాద్ విద్యుత్ సౌధ ముట్టడిని విజయవంతం చేసి విద్యుత్ ఉద్యోగుల సత్తా ఏంటో చూపించాలని టీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం కేటీపీఎస్ అకౌంట్స్ గ్రౌండ్ నందు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేతన సవరణపై మేనేజ్‌మెంట్‌కు నోటీస్ ఇచ్చామని, యాజమాన్యాలతో, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో పలుమార్లు చేసిన చర్చలు సఫలం కాలేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు యాజమాన్యం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు నాలుగు సార్లు ఆందోళన కార్యక్రమాలు వాయిదా వేసుకున్నామని వెల్లడించారు. 1999–2004 మధ్య విధుల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, ఆర్టిజన్‌లు చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారని, వారికి పర్సనల్ పే బేసిక్‌లో కలపాలని డిమాండ్ చేశారు. జీఓ 6ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోచైర్మన్ శ్రీధర్, వైస్ చైర్మన్‌లు అనిల్‌కుమార్. ఎంఏ వజీర్, మాజిద్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, మాధవరావు, సదానందం, మణిలాల్, సుధీర్, సీతారాంరెడ్డి, బ్రహ్మాజీ, స్వామి, సునీల్, రాందాస్, గిరిధర్, కేవీ రామారావు, రవీందర్, సతీశ్, కోటేశ్వరరావు, రాజేంద్ర, మహేశ్, ధనయ్య, వేణగోపాల్, పీవీ రావు, సురేశ్, పవన్‌కుమార్, వెంకటనారాయణ, రమాకాంత్, వెంకటేశ్వరరావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ప్రతి ఎకరా నమోదు చేయాలి

జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య • మొక్కజొన్న పంటల పరిశీలన


బేతంపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

టేకులపల్లి: అకాల వర్షం కారణంగా నష్టపోయిన మొక్కజొన్న పంట ప్రతి ఎకరాను నమోదు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం గోలియాతండా, బేతంపూడి పంచాయతీల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు మండలంలోని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించి గణితం, ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలపై విద్యార్థులకు గల సామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దివ్యాంగుల కొరకు ఉద్దేశించిన భవిత పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని ఉపాధ్యాయుడు రవీందర్ జెడ్పీచైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోడ సరిత, బోడ నిరోషా, బాబు, ఏఈఓ పూర్ణ, విశాల, వార్డు సభ్యులు నోముల భానుచందర్, రవి, నాయకులు, రెడ్యానాయక్, మంగీలాల్, సంజయ్, రావూరి సతీష్, పూన్యా, ఈది గణేశ్, తదితరులు పాల్గొన్నారు.





సంత వ్యాపారిపై కేసు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట పోలీసులు మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన సంత వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం. మావోయిస్టు సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలతో ఈ నెల 17వ తేదీన కిష్టారం పోలీసులు అదుపులోకి తీసుకుని కుంట, సుకుమా పోలీస్‌స్టేషన్‌లలో విచారణ చేపట్టి నిజాలు రాబట్టి మావోయిస్టులతో గల సంబంధాలను నిర్ధారణ చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు విశ్వసనీయసమాచారం.

నలుగురిపై కేసు..

పాల్వంచరూరల్: మండలంలోని మొండికట్ట గ్రామంలో ఈ నెల 11వ తేదీన గండికోట శంకర్, నరేశ్, గణేశ్, శివ ఇంటి మీదకు వచ్చి కర్రలతో దాడిచేసి బూతులు తిట్టారని సమ్మక్క మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కేశవాపురంలో చోరీ

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం గ్రామంలో ఓ ఇంట్లో అర్ధరాత్రి దొంగలు బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఏఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. కేశవాపురం గ్రామానికి చెందిన బండి శ్రీను ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి ఇంట్లో పడుకున్న బండి శ్రీను భార్య జానకమ్మ మెడలోని బంగారు గొలుసు, బీరువాలో ఉన్న బంగారు లాకెట్, ఉంగరాలు చోరీ చేశారని బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోయినవాటి విలువ రూ.90 వేలు ఉంటుందని ఏఎస్ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్..

మండలంలోని సారేకల్లు గ్రామానికి చెందిన బాలికను గుర్తు తెలియని వ్యక్తి సోమవారం కిడ్నాప్ చేశారని తల్లి సోమలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మావోయిస్టును పట్టుకున్న పోలీసులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో రూ.లక్ష రివార్డు కలిగిన ఓ మావోయిస్టును పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. దంతెవాడ జిల్లాలోని అరుణ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రేవాలి గ్రామ సమీపంలో గల బుర్గం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు దంతెవాడ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ 111 బెటాలియన్ సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఆపరేషన్ కొనసాగుతున్న దశలో బుర్గం అటవీ ప్రాంతంలో పోలీ సు బలగాలను గమనించిన మావోయిస్టు పారిపోతున్న క్రమంలో పోలీసు బలగా లు అతడిని వెంబడించి పట్టుకొని విచారించారు. అతను అరుణ్‌పూర్ పోలీస్ స్టేసన్ పరిధిలోని మొట్టగూడెం గ్రామానికి చెందిన వాడని, బుర్గం పంచాయతీలో మావో యిస్టు పార్టీకి అనుబంధంగా ఉన్న జనత నసర్కార్‌కు అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తేలింది. కాగా, పట్టుబడిన మావోయిస్టు తలపై రూ.లక్ష రివార్డు కూడా ఉందని అక్కడి పోలీసులు తెలిపారు. ఇతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు అరుణ్‌పూర్ పోలీసుల తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

మణుగూరుటౌన్: అడవులను సంరక్షించడం మనందరి బాధ్య త అని మణుగూరు జెడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు, మణుగూరు ఫారెస్టు రేంజ్ అధి కారి ద్వాలియా అన్నారు. మంగళవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మణుగూ రు ఫారెస్ట్ రేంజ్ ఆధ్వర్యంలో స్థానిక సమ్మక్క సారలమ్మ ఆలయ పరిసరాల్లో జెడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు చేతులమీదుగా మొక్కనాటినారు. ఫారె స్టు ఉద్యోగులు, సిబ్బంది మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అడవులను కాపాడితే అవి మనలను కాపాడుతాయంటూ నినాదాలు చేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో అడవుల్లో చెత్త తగలబెట్టవద్దని, అడవులను సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అడపా అప్పారావు, మేకల రవి, మడి వీరన్నబాబు, సర్పంచ్‌లు కారం ముత్తయ్య, బొగ్గం రజిత, మణుగూరు ఏరియా సెక్షన్ అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ క్లినిక్ సందర్శన

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ క్లినిక్‌ను రాష్ట్ర పర్యవేక్షకులు డాక్టర్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుకృత వేర్వేరుగా సందర్శించారు. మహిళ క్లినిక్ వివరాలను మండల వైద్యాధికారి ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌కు తప్పనిసరిగా ఓపీ 70కిపైగా ఉండేవిధంగా చూడాలని సూచించారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియో గం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మలేరియ కన్సల్టెంట్ కృష్ణయ్య, పీహెచ్ఎన్ పూలమ్మ, హెచ్‌వీ శారారాణి, హెచ్ఏ ప్రేమలత, సుశీల, ఎల్‌టీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






ఏరియా స్టోర్ నుంచి కేబుల్ చోరీ

- ఆలస్యంగా గుర్తించిన అధికారులు
- రూ.8.50 లక్షల విలువ చేసే 9 టన్నుల కేబుల్ మాయం


వివరాలు వెల్లడిస్తున్న డీజీఎం పర్సనల్ జీవి మోహన్‌రావు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా స్టోర్ నుంచి రూ.8.50 లక్షల విలువ చేసే కేబుల్ చోరీకి గురైంది. గుట్టు చప్పుడు కాకుండా చోరీ ఘటనపై విజిలెన్స్ విచారణ కూడా సాగుతోంది. సోమవారం ఈ చోరీ ఘటన వెలుగు చూడటంతో అధికారులు హడావుడి చేశారు. వివరాలిలా ఉన్నాయి.. 21 ఇంక్లయిన్ మైన్ మూత పడటంతో అక్కడి వస్తువులన్నీ స్టోర్‌కు తరలించారు. గత జనవరిలో అక్కడ వాడిన కేబుల్‌ను కూడా స్టోర్‌కు తరలించి ఓ షెడ్డులో భద్రపర్చారు. ఈ నెల 18వ తేదీన ఆ స్టోర్‌లో కేబుల్ మాయం అయినట్లు అధికారులకు సమాచారం అందింది. అధికారుల సూచన మేరకు స్టోర్‌ను తెరిచి చూశారు. సుమారు 9 టన్నుల విలువ చేసే కేబుల్ అక్కడి నుంచి మాయం అయినట్లు గుర్తించారు. అప్పటికే విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదు చేరింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. రెండు రోజులుగా ఇల్లెందు ఏరియా సింగరేణి స్టోర్‌లో సోదాలు, సంబంధిత అధికారుల నుంచి సమాచారం రాబట్టేందుకు విచారణ కొనసాగిస్తున్నారు. సుమారు 8.50 లక్షల విలువైన కేబుల్ చోరీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. కాగా, చోరీ వెలుగు చూడకుండా ఉండేందుకు కొన్ని వర్గాలకు ముడుపులు ముట్టజెప్పినట్లు అక్కడి అధికారి ఒకరు అంగీకరించారు. చోరీ ఘటనపై సింగరేణి ఏరియా డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. జనవరి నెలలో 21 ఇంక్లయిన్ మైన్‌కు చెందిన వాడిన కేబుల్ సుమారు 9 టన్నులను స్టోర్‌లోని షెడ్డులో భద్రపర్చినట్లు తెలిపారు. ఈ నెల 18న కేబుల్ అక్కడి నుంచి చోరీ జరిగినట్లు సమాచారం అందటంతో స్టోర్ ఓపెన్ చేసి చూడగా కేబుల్ లేదని తేలిందని, ఈ విషయంపై విజిలెన్స్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామని, విచారణ కూడా సాగుతోందన్నారు. విచారణ పూర్తయితే వివరాలు తెలుస్తాయని చెప్పారు.



క్లుప్తంగా...


తిరుమల ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ ఈవో

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళ వారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. కాగా, బుధవారం ఉగాది ఆస్థానం సందర్భంగా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

సీఆర్డీఏ ప్రాంతంలోనూ పేదలకు ఇళ్లు

గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలులో 900.97 ఎకరాలను ఆర్–5 జోన్‌గా నిర్ణయించింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, నిరుపేదలకు అక్కడ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. సీఆర్డీఏ చట్టంలోని నిబంధనల ప్రకారం మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతం నిరుపేదలకు కేటాయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమవుతోంది. నెల రోజుల్లో 900.97 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేసి కలెక్టర్లకు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 54 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ ఆర్–5 జోన్‌లో ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు.

చదువులకు 'బలం'!

జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: సీఎం జగన్

- బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ
- సమృద్ధిగా ఐరన్, కాల్షియంతో బాల్యానికి బలం
- ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో 38 లక్షల మందికి రాగి జావ
- మంచి మేనమామలా 15 రకాల పదార్థాలతో పిల్లలకు రుచికరమైన మెనూ



సాక్షి, అమరావతి: మన విద్యార్థులంతా భావి ప్రపంచంతో పోటీపడి రాణించేలా ప్రతి అడుగులోనూ వారికి అండదండలు అందిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పిల్లలకు మంచి మేనమామలా వారికి అందించే ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కూడా పిల్లల బాగు కోసం ఇంత తపన పడలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 'మన ప్రభుత్వం రాక ముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి..? ఒక సారి తేడాను గమనించండి. పిల్లలు ఏం తింటున్నారు? అని ఒక ముఖ్యమంత్రి ఆలోచన చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారన్న మంచి ఆలోచనతో గోరుముద్దను చేపట్టాం. పిల్లలకు మంచి మేనమామలా 15 రకాల ఆహార పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏడాదికి కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి. ఇప్పుడు గోరుముద్ద కోసం ఏడాదికి రూ.1,824 కోట్లు ఖర్చు చేస్తున్నాం'అని తెలిపారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏప్రిల్‌లో పదో తరగతితో పాటు మిగిలిన పిల్లలకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారందరికీ ఓ మేనమామగా ఆల్ ద వెరీ బెస్ట్ చెబుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

మొదటి రోజు నుంచే..

అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చదువులను సంస్కరించడంపై దృష్టి పెట్టాం. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. చదువుకునే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇక 6వ తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాడు – నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలులోకి తీసుకొస్తాం. ఇలా ప్రతి అడుగులోనూ పిల్లలను చేయిపట్టి నడిపిస్తున్నాం.

మరింత బలవర్ధకంగా గోరుముద్ద

గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో రుచికరంగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు మరింత బలవర్ధకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. ఇవాళ్టి నుంచి పిల్లలకు రాగిజావ కూడా అందిస్తూ గోరుముద్దను మరింత పుష్టికరంగా తీర్చిదిద్దుతున్నాం. రాగి జావ పిల్లల్లో సమృద్ధిగా ఐరన్, కాల్షియం కంటెంట్ పెరిగేలా దోహదపడుతుంది. మిడ్ డే మీల్స్ అంటూ గత ప్రభుత్వ హయాంలో మొత్తం సంవత్సరం అంతా కలిపినా కూడా ఏడాదికి రూ.450 కోట్లు కూడా మధ్యాహ్న భోజనానికి ఖర్చు చేయని దుస్థితి. అలాంటి అధ్వాన్నమైన పరిస్థితుల నుంచి గోరుముద్ద అనే కార్యక్రమం ద్వారా రోజుకొక మెనూతో పూర్తిగా మార్చి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.450 కోట్లు మాత్రమే ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు ఏడాదికి రూ.1,824 కోట్లకు పెంచి గోరుముద్ద కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు రాగి జావ కోసం అదనంగా మరో రూ.86 కోట్లు ఇస్తున్నాం. రోజుకో మెనూతో పిల్లలకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం.

సత్యసాయి ట్రస్టు సహకారంతో..

పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు భాగస్వామి కావడం నిజంగా మంచి పరిణామం. ఏటా దాదాపు రూ.86 కోట్లు ఖర్చయ్యే రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు రూ.42 కోట్లు అందిస్తుండగా మిగిలిన రూ.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తూ మంచి కార్యక్రమానికి ముందడుగు వేస్తున్నాం.

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరినా పవన్ స్పందించలేదు
- ఎమ్మెల్సీ మాధవ్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనకు మద్దతుగా బహిరంగ ప్రకటన చేయాలని స్వయంగా మిత్రపక్ష జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరినా ఆయన స్పందించలేదని.. క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసే పరిస్థితి లేనప్పుడు బీజేపీ–జనసేన 'కలిసి ఉన్నా లేనట్లే'అని శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. పొత్తులో కొనసాగుతున్నప్పటికీ జనసేన ఎక్కడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలపని అంశంపై మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మాధవ్ వెల్లడించారు. 'మేం జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం ఉంది. ఇటీవల పవన్ కూడా జనసేన–బీజేపీ పొత్తు ఉంది అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం లేదన్నది వాస్తవం. నిజంగా పొత్తులో ఉంటే క్షేత్రస్థాయిలో కూడా కలిసి పనిచేయాలని కోరుతున్నాం'.. అని మాధవ్ వ్యాఖ్యానించారు. 'కలిసి పనిచేస్తే ప్రజా మద్దతు రెండు పార్టీలకు ఉంటుంది. ఆయనా (పవన్) నమ్మాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రకటన చేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. కానీ, ప్రకటన రాలేదు'.. అని మాధవ్ చెప్పారు. కలిసి పనిచేసే విషయంలో బీజేపీ నుంచే స్పందనలేదని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆయన వైపు నుంచే స్పందనలేదు'అని బదులిచ్చారు.

తవ్వేకొద్దీ బయటపడుతున్న

మార్గదర్శి మోసాలు

రూ.459.98 కోట్లను దారి మళ్లించినట్లు ఇప్పటికే ఆడిట్‌లో నిర్ధారణ

- తాజాగా మరిన్ని అక్రమాలు బట్టబయలు
- ప్రతి గ్రూపులో పాడుకునే రెండో నెల పాటకు ఎటువంటి చందా కట్టని వైనం
- ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందాలకు ఎగనామం
- ఇవేమీ చెల్లించకుండానే ప్రతి గ్రూపుపైనా ప్రతి నెలా 5 శాతం కమీషన్ స్వీకరణ
- గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి
- ఈ ఉల్లంఘనలపై ఆయా బ్రాంచ్‌ల వివరణ కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ



సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రూ.459.98 కోట్ల సొమ్మును చట్టవిరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, తదితరాల్లోకి మళ్లించినట్లు ఆడిటింగ్‌లో అధికారులు నిర్ధారించారు. తద్వారా చందాదారుల సొమ్మును తమ వ్యక్తిగత లబ్ధి కోసం రామోజీరావు, ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజ వినియోగించుకున్నట్లు స్పష్టమైంది. తాజాగా ప్రతి చిట్ గ్రూపులో ఖాళీ చిట్లు, కంపెనీ పాడుకునే రెండో నెల చిట్ల లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. మార్గదర్శి మేనేజర్లు సమర్పించిన మినిట్స్‌ను విశ్లేషించిన ఆడిట్ అధికారులు ఈ మోసాలను గుర్తించారు. ఖాళీ చిట్లకు గానీ, ప్రతి చిట్ గ్రూపులో కంపెనీ పాడుకునే రెండో నెల చిట్‌కు సంబంధించి గానీ ఎటువంటి సొమ్ము (నెల వారీ చందా) చెల్లించలేదని వెల్లడైంది. ప్రతి చిట్ గ్రూపులో రెండో నెల చిట్ పాటను కంపెనీయే పాడుకునే అవకాశం ఉంది. అందుకోసం అందరి చందాదారుల మాదిరిగానే కంపెనీ కూడా చందా కట్టాలి. కానీ చందా కట్టకుండానే ఆ రెండో నెల చిట్‌ను పాడుకుని కంపెనీ జమ చేసుకుంటోంది. కంపెనీ తరఫున కట్టాల్సిన ఎటువంటి చందాలు కట్టకుండానే ప్రతి నెలా ప్రతి గ్రూపు నుంచి 5 శాతం కమీషన్‌ను తీసుకుంటోంది.

ఆధారాలతో సహా వెలుగుచూసిన అక్రమాలు

గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు మార్గదర్శి యూనిట్లలో ఈ మోసాలు ఆధారాలతో సహా బయటపడ్డాయి. గుంటూరు జిల్లాలో ఐదు చిట్ గ్రూపులను విశ్లేషించగా వాటి ద్వారా రూ.1.18 కోట్లను చిట్ కమీషన్‌గా, రూ.1.73 కోట్లను రెండో నెల పాడుకున్న చిట్ సొమ్ముగా కంపెనీ జమ చేసుకుంది. కానీ పాడుకున్న రెండో నెల చిట్ చందా.. అలాగే ఆ గ్రూపులో తన పేరు (ఫోర్‌మెన్) మీద ఉంచుకున్న ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందా సొమ్ము రూ.6.98 కోట్లు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. విజయనగరం జిల్లాలో 12 చిట్ గ్రూపులను విశ్లేషించినప్పుడు ఫోర్‌మెన్ కమీషన్ రూ.60.50 లక్షలు, రెండో నెల పాడుకున్న చిట్ మొత్తం రూ.1.05 కోట్లను కంపెనీ ఖాతాలో వేసుకున్నారు. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రెండో నెల చిట్ చందాలు, కంపెనీ పేరు మీద ఉన్న ఖాళీ చిట్ల చందాల మొత్తం రూ.54.85 లక్షలు కట్టలేదని తేలింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 28 చిట్ గ్రూపులను పరిశీలించినప్పుడు వాటికి ఫోర్‌మెన్ కమీషన్ రూ.3.47 కోట్లు, రెండో నెల పాడుకున్న చిట్ల మొత్తం రూ.2.73 కోట్లను కంపెనీ తీసుకుంది. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రూ.2.88 కోట్ల చందా సొమ్మును కట్టలేదు.

భారీగా ఉల్లంఘనలు..

నెల వారీగా చందాదారులతోపాటు కట్టాల్సిన సొమ్మును కట్టకుండానే కమీషన్ తీసుకోవడం, ప్రతి గ్రూపులోనూ చందా కట్టకుండానే రెండో నెల చిట్‌ను పాడుకుని ఆ సొమ్మును తీసుకోవడం ద్వారా మార్గదర్శిలో చిట్లు వేసిన వారిని రామోజీరావు, ఆయన కోడలు శైలజ మోసం చేసినట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును పణంగా పెట్టి భారీగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఖాళీగా ఉన్న చిట్లకు సంబంధించి ఎటువంటి చందా చెల్లించకుండా మిగిలిన చందాదారులను మభ్యపెట్టినట్లు తేలింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత మార్గదర్శి బ్రాంచ్‌లను ఆదేశించినట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు.


జిల్లా వార్తలు

భద్రగిరి విద్వాంసులకు ఉగాది పురస్కారాలు


పురస్కారాలకు ఎంపికైన కేశవ్, నాగేశ్వరరావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో డోలు, సన్నాయి నాదస్వరం విద్వాంసులుగా కొనసాగుతున్న ముస్నంగి నాగేశ్వరరావు, కేశవ్‌కు రాష్ట్రప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం జరగనున్న ఉగాది వేడుకల్లో వీరికి పురస్కారాలు అందజేయనుండగా, హైదరాబాద్ బయలుదేరారు. భద్రాచలంలోని రామాలయంలో జరిగే ప్రధాన ఉత్సవాలతో పాటుగా రోజువారి సేవా కార్యక్రమాల్లో వీరు సేవలందిస్తున్నారు. ఇందులో నాగేశ్వరరావు నలభై ఏళ్లుగా స్వామి సేవలో ఉండగా జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాగా, నాగేశ్వరరావు, కేశవ్ పురస్కారాలకు ఎంపికవడంపై ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఇల్లెందు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ల పర్యటన


ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్లు

ఇల్లెందు/టేకులపల్లి: ఇల్లెందు ఏరియాలోని గనులను సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇల్లెందులోని జేకే ఓసీ, టేకులపల్లి మండలం కోయగూడెంలోని కేఓసీని సందర్శించిన వారు వ్యూ పాయింట్ల నుంచి బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోపే ఇల్లెందు ఏరియా సాధించడంపై జీఎం షాలేము రాజు, ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ పురోగతికి పాటుపడాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో అధికారులు మల్లారపు మల్లయ్య, జి.ప్రభాకర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, పూర్ణచందర్‌రావు, సౌరభ్ సుమన్, చిన్నయ్య, శివశంకర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇల్లెందు జేకే ఓసీ విస్తరణను సంస్థ ద్వారా చేపట్టాలే తప్ప ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దని టీబీజీకేఎస్ నాయకుడు ఎస్.రంగనాథ్ ఆధ్వర్యాన సింగరేణి డైరెక్టర్లకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు బొలా రామారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సామ్రాజ్య' వేడుకలకు సన్నాహం


విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న రామాలయం

- బ్రహ్మోత్సవ శోభ సంతరించుకున్న భద్రగిరి
- నేడు ఆలయంలో పుష్కర పట్టాభిషేకానికి అంకురార్పణ
- యాగశాలలో రామాయణ క్రతువుకు ఏర్పాట్లు
- నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు నిత్యకల్యాణాలు రద్దు


హోమగుండం సిద్ధం చేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రగిరిలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకళ్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అలాగే ఈనెల 31 వరకు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద హవనం, శ్రీరామాయణ మహాక్రతువు నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో శ్రీసీతారాముల కల్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది పుష్కర పట్టాభిషేకం సందర్భంగా యాగశాలలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

నేడు ఉగాది వేడుకలు..

శోభకృత్ నామ సంవత్సరాది(ఉగాది)ని పురస్కరించుకుని గర్భాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. వేప పూత పచ్చడిని నివేదన చేసి భక్తులకు పంచుతారు. ఉదయం 7 గంటలకు మూలవరులకు ప్రత్యేక అభిషేకం (తిరుమంజనం) నిర్వహిస్తారు. ప్రతీ ఆదివారం మాత్రమే జరిగే ఈ అభిషేకం ఏడాదిలో ఐదు ప్రత్యేక రోజుల్లోనూ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, శ్రీరామనవమి, వైశాఖ పునర్వసు, నరక చతుర్దశి, వైకుంఠ ఏకాదశి రోజుల్లో ప్రత్యేకంగా అలకరించి అభిషేకం చేస్తుంటారు. సాయంత్రం ఆస్థాన పురోహితులచే పంచాంగ శ్రవణం ఉంటుంది.

29 వరకు ప్రత్యేక పూజలు..

శ్రీ రామాయణ క్రతువుకు శ్రీకారం చుట్టి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. బుధవారం అంకురార్పణ అనంతరం 29వ తేదీ వరకు యాగశాలలో, ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. 23 నుంచి 29వ తేదీ వరకు ఉదయం 7 గంటలకు తిరువారాధన, సేవాకాలం, తీర్థ ఘోష్ఠి, 8.30 గంటలకు రామాయణ మహాక్రతువులో భాగంగా చతుర్వేద, రామాయణ, రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరీ మంత్ర హోమాలు, 11 గంటలకు సంక్షేప రామాయణ సామూహిక పారాయణం, 11.30 గంటలకు నిత్య పూర్ణాహుతి, ప్రసాద వినియోగం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్ర సామూహిక పారాయణం, 6 గంటలకు రామాయణ మహా క్రతువు హోమాలు, 7 గంటలకు వేదిక వద్ద రామాయణ ప్రవచనం, రాత్రి 8 గంటలకు నిత్య పూర్ణాహుతి, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు.

ఏప్రిల్ 5 వరకు నిత్యకల్యాణాలు రద్దు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నుంచి ఏప్రిల్ 5 వరకు స్వామివారి నిత్యకల్యాణ వేడుకను, ఈనెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు దర్బారు సేవలను రద్దు చేశారు. 26 నుంచి ఏప్రిల్ 11 వరకు పవళింపు సేవలను కూడా నిలిపివేయనున్నారు. ఈనెల 30న శ్రీరామ పునర్వసు దీక్ష, ఏప్రిల్ 12న నూతన పర్యంకోత్సవం, ఏప్రిల్ 27న శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ, ఏప్రిల్ 28న పట్టాభిషేకం జరగనున్నాయి.

నేటి పూజా కార్యక్రమాలిలా...

పుష్కర పట్టాభిషేక ఉత్సవాలకు ఆలయం వద్ద నిర్మించిన ప్రత్యేక యాగశాలలో బుధవారం అంకురార్పణ చేస్తారు. ఉదయం ఏడు గంటలకు మూలమూర్తుల సన్నిధిలో ఉత్సవ అనుజ్ఞ తీసుకుంటారు. 7.30 గంటలకు ఓంకార ధ్వజారోహణం, ఎనిమిది గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, చిత్రకూట మండపంలో వాస్తు హోమాలు, 11.30 గంటలకు పుష్కర యాగశాలలో పర్యగ్నికరణం, యాగశాల ప్రవేశము, దేవాలయ ప్రాంగణములో సంక్షేప రామాయణ హవనం నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయంలో దర్బార్ సేవ, ఆరు గంటలకు ఆస్థాన పండితులచే పంచాంగ శ్రవణం, రాత్రి ఏడు గంటలకు యాగశాల వద్ద శ్రీ రామాయణ క్రతువు, ఎనిమిది గంటలకు అంకురార్పణ, ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరుగుతాయి.

జనావాసాల్లోకి అడవి బర్రె

- నడుం భాగంలో తీవ్రగాయంతో అవస్థ
- వరంగల్ జూకు తరలించిన రెస్క్యూ టీం


మిర్చి చేనులో కదలలేని స్థితిలో పడి ఉన్న అడవి బర్రె

కరకగూడెం: కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామంలోకి మంగళవారం ఉదయం అడవి బర్రె వచ్చింది. స్థానిక రైతు గోగు ముత్తయ్య మిర్చి చేనులో బలమైన గాయాలతో పడి ఉన్న అడవి దున్నను గుర్తించిన రైతులు ఇచ్చిన సమాచారంతో బయ్యారం రేంజర్ తేజస్విని, రెస్క్యూ టీంతో చేరుకున్నారు. అడవి దున్నతో పోట్లాడిన క్రమంలో బర్రె నడుముకి బలమైన గాయమై కదలలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వైద్యులు ప్రాథమిక చికిత్స చేశాక బోనులో వరంగల్‌లోని కాకతీయ జూ పార్క్‌కు తరలించారు. కాగా, అడవి దున్న పూర్తిగా కోలుకున్నాక అటవీ ప్రాంతంలో వదిలేస్తామని అటవీ శాఖాధికారులు వెల్లడించారు.

బీజేపీని దింపితేనే దేశానికి భద్రత




మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పక్కన నాయకులు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: 'బీజేపీ కో హటావో, దేశ్‌కో బచావో' నినాదంతో మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పాల్వంచ మండలం పెద్దమ్మగుడి సమీపాన ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ సర్కారును గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీకి చెందిన సీఎం.రమేష్, సుజనాచౌదరి తదితర నేతలను బీజేపీలో చేర్చుకుని ఒక్క కేసు లేకుండా క్లీన్‌చీట్ ఇస్తున్నారని.. బీజేపీలో చేరకపోతే మాత్రం కేసుల పేరిట వేధిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆ పార్టీని అడుగుపెట్టనిచ్చేది లేదన్నారు. వచ్చేనెల 14 నుంచి చేపడుతున్న 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రానున్న సింగరేణి గుర్తింపు సంఘాల ఎన్నికల్లో సత్తా చాటాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, నాయకులు బి.అయోధ్య, మిర్యాల రంగయ్య, బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, సారయ్య, కల్లూరి వెంకటేశ్వర్లు, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఏపూరి బ్రహ్మం, కమటం వెంకటేశ్వర్లు, ఎస్.డీ.సలీం, పూర్ణచందర్‌రావు, నరాటి ప్రసాద్, వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, చంద్ర నరేంద్రకుమార్, వై.భాస్కర్‌రావు, సునీల్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ముగిసిన పోటీలు


త్రో బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థి

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు)లోని మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు కిన్నెరసాని పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఉమ్మడి జిల్లా నుంచి 95మంది విద్యార్థులు హాజరుకాగా, బ్యాటరీ టెస్టులు నిర్వహించినట్లు ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారి జాబితా వారం రోజుల్లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం చందుతో పీటు ఉపాధ్యాయులు పీడీలు నాగరాజు, బుగ్గా వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నగేష్, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, బి.వెంకటేశ్వర్లు, సునంద, వీరన్న, బాలరాజు, భద్రు, పాల్గొన్నారు.

రాజభవన్‌లో 'గూడెం' కళాకారులు


సీతాప్రసాద్ బృందాదాన్ని సన్మానిస్తున్న గవర్నర్ తమిళిసై

కొత్తగూడెంటౌన్: ఉగాది వేడుకలను హైదరాబాద్‌లోని రాజభవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంకు చెందిన నృత్య కళాకారులు సీతాప్రసాద్ శిష్య బృందం పాల్గొని గవర్నర్ తమిళిసై సమక్షాన ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులను గవర్నర్ సన్మానించారు.